క్లుప్తంగా...

నేడు ప్రజావాణి రద్దు

కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక ఏర్పాట్ల నేపథ్యంలో ఈ నెల 29న (సోమవారం) జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

వల్లమల్ల ప్రవీణ్‌కు డాక్టరేట్



పోచారం: ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన వల్లమల్ల ప్రవీణ్‌కు గౌరవ డాక్టరేట్‌ను తమిళనాడులోని ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ప్రదానం చేసింది. ప్రవీణ్ గతంలో చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌తో యూనివర్సిటీ ఘనంగా సత్కరించింది. డాక్టరేట్ లభించినందుకు ప్రవీణ్ సంతోషం వ్యక్తం చేశారు.

మైనార్టీలకు డబుల్ ఇళ్లు ఇవ్వాలని వినతి



మేడ్చల్: మైనార్టీల్లో అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని పట్టణ మైనార్టీలు మంత్రి మల్లారెడ్డిని కోరారు. మంత్రి ఇంట్లో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. మైనార్టీ పేదలకు డబుల్ ఇళ్లు లేదా కనీసం 50గజాల స్థలం ఇచ్చేలా చూడాలని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు లాయక్ అలీ, శేఖర్‌గౌడ్, కౌన్సిలర్ మణికంఠగౌడ్, రఫిక్ తదితరులు ఉన్నారు.

17వ వార్డులో ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేడ్చల్: పట్టణంలోని 17వ వార్డులో ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని వార్డు కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్ ప్రారంభించారు. నగరంలోరిని దీన్‌దయాల్ ఈఎన్‌టీ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు చెవి, ముక్కు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆసుపత్రికి రెఫర్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు రవిందర్‌గౌడ్, శివకుమార్‌యాదవ్, సాటే నరేందర్, శేఖర్‌గౌడ్ తదితరులున్నారు.

పార్కులను అభివృద్ధి చేస్తాం



నాగారం 7వ వార్డులో చిల్డ్రన్ పార్కును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఉన్న పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకొస్తామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులోని ఉషోదయకాలనీ, ఈశ్వరిపురికాలనీ, మామిండ్ల నారాయణకాలనీల్లో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా సుమారు రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కులను ఆయన కౌన్సిలర్ గూడురు సబితతో కలిసి ప్రారంభించారు. కాలనీవాసులు వెంకటేశ్వర రెడ్డి, సత్యనారాయణ, సుబ్బారెడ్డి, అంజి రాజు, మురళి, మధు, నవీన్‌రెడ్డి ఉన్నారు.

షెడ్యూల్ కులాల సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఉప్పల్: చిలుకానగర్ షెడ్యూల్ కులాల సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. సంఘం నూతన అధ్యక్షుడిగా కొంద్ర రాములు, ప్రధాన కార్యదర్శిగా పల్లాటి డేవిడ్, కోశాధికారిగా మోగిలిపాక రామ్‌చందర్, ఉప కోశాధికారిగా అల్లిబిల్లి మహేందర్, ఉపాధ్యక్షులుగా మారపాక సాయిలు, పార్నంది నర్సింగరావు, కొంగరి రామచందర్, సంయుక్త కార్యదర్శిగా జేమ్స్ ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

వార్డు కమిటీలున్నా.. లేనట్టే..!

పాలక యంత్రాంగం చిన్నచూపుతో దూరంగా కమిటీల సభ్యులు

- కమిటీల్లో విద్యావంతులు, ప్రజాసంబంధాలు ఉన్న వారికి చోటు
- ఒక వార్డుకు 4 కమిటీలు.. ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులు
- శివారు 28 పురపాలికల్లో 2,560 వార్డు కమిటీలు.. 38,400 మంది సభ్యులు
- వార్డు కమిటీలకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: పట్టణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం, పాలకవర్గం, అధికార యంత్రాంగం, పట్టణవాసులను భాగస్వామ్యం చేస్తూ.. 2020 ఏప్రిల్లో పురపాలికల్లో వార్డు కమిటీలను ఏర్పాటు చేసింది. ప్రజలతో సంబంధం కలిగిన ఉన్న వారికి, విద్యావంతులకు కమిటీలో చోటు కల్పించారు. వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో వారి పాత్ర కీలకమనేది పాలకవర్గం, అధికారులు విస్మరించాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే తీరుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం వేసవిలో పట్టణాల్లో మురుగు కాలువ పనులు, పూడికతీత, ముళ్లకంపల తొలగింపు, మురుగు మళ్లింపు తదితర పనులు చేపట్టారు. వీటిలో ఎక్కడా కమిటీల అభిప్రాయాన్ని తీసుకోలేదు. పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణ, హరితహారం, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, అక్రమ కట్టడాలు, అభివృద్ధి పనులు తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది.

శివారు పురపాలికల్లో 38,400 సభ్యులు

- నగర శివారుల్లోని మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 28 పురపాలికల్లో 640 డివిజన్లు/వార్డులు ఉండగా, ఇందులో 2,560 కమిటీలను నియమించారు. ఈ కమిటీల పరిధిలో 38,400 మంది సభ్యులు ఉన్నారు. కొత్త కమిటీ ఏర్పడి మూడేళ్లయ్యింది. ఒక వార్డుకు 4 కమిటీలు చొప్పున, ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా డివిజన్/ వార్డుల్లోని యువజన, వయోజన, ప్రముఖులు, మహిళలు ఇలా నాలుగు రకాల కమిటీలను తయారు చేశారు. పురపాలకవర్గాలు తమ ఇష్టం వచ్చిన వారిని ఎంపిక చేసి కమిటీలో చోటు కల్పించారు.

సమస్యలు ఇక్కడే..

- శివారు పట్టణాల్లో పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై చూపకపోవడంతో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే వర్షాకాలంలో శివారు పురపాలికల్లో ప్రజలకు కష్టాలు తప్పవని తెలుస్తోంది. చిన్న పాటి వర్షం పడితే చాలు.. రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే.. లోతట్టు ప్రాంతాలు, మురికి వాడలు వరదమయంగా మారుతుండగా, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా నడవలేని స్థితికి చేరుతుండటంతో పట్టణ ప్రజలకు బాధలు తప్పటం లేదు.
- శివారుల్లోని గ్రామ, నగర పంచాయతీల విలీనంతో పురపాలక సంఘాలుగా ఏర్పడ్డాయి. శివారుల్లోని అతిపెద్ద పట్టణం బోడుప్పల్లో 162 కాలనీలు ఉండగా, వివిధ పన్నుల ద్వారా ఏటా రూ.60 కోట్ల ఆదాయం వస్తున్నా.. ప్రజలు మాత్రం అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, కాలుష్యంతో చెరువు నీటి దుర్వాసన, నీటి సరఫరా పైప్‌లైన్ల లీకేజీలు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మరో నగర పాలక సంస్థ పీర్జాదిగూడలో 80 కాలనీలు ఉండగా, ఏటా పన్నుల ద్వారా ఏటా రూ.30 కోట్ల ఆదాయం సమకూరినా ప్రజలు మాత్రం పలు సమస్యలతో బాధపడుతున్నారు. ఈ రెండు పట్టణాలకు మాత్రమే సమస్యలు పరిమితం కాలేదు. ఇలాంటి అధ్వాన్న పరిస్థితులు ఉన్న పట్టణాలు శివారు పరిధిలో మరో 4 నగర పాలక సంస్థలు, 23 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇక్కడ కూడా ప్రజల పలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

శివారు పురపాలికలివే..

- నగర శివారుల్లో బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట్, జవహర్‌నగర్, బడంగ్‌పేట్, మీర్‌పేట, బండ్లగూడ నగర పాలక సంస్థలు ఉండగా, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, పెద్ద అంబర్పేట్, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, జల్పల్లి, షాద్‌నగర్, శంషాబాద్, శంకరపల్లి, తుర్కంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, అమనగల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి అంతంతే..

- శివారు పట్టణాల్లో ముక్కుపిండి ఏటా వివిధ పన్నుల రూపేణా రూ.343 కోట్లు వసూలు చేస్తున్నా.. పురపాలికలు ప్రజలకు మాత్రం సేవలు అందించడంలో విఫలం అవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతినెలా ఒక్కో పురపాలక సంఘానికి రూ.3 లక్షల నుంచి రూ.21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. పట్టణ ప్రగతితో కూడా పురపాలక సంఘాల ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులన్నింటిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నా, పట్టించుకోకపోవడంతో అభివృద్ధి రెండు అడుగులు ముందుకు.. మూడు అడుగులు వెనక్కి అన్న చందంగా ఉంది.

వార్డు కమిటీలకు విధులపై..

- వార్డు కమిటీలకు విధులపై అవగాహన కల్పించేందుకు పురపాలక యంత్రాంగం కృషి చేయాల్సిన అవసరం ఉంది. వారికున్న విధులేమిటి, ఏ పనులపై అజమాయిషీ ఉండాలనే విషయంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరుతున్నారు. వార్డు సభ్యులకు సేవాభావం ఉండేలా చైతన్యం, అవగాహన కల్పించడం ద్వారా పురపాలికల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని కోరుతున్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ శోభారాణి

- మంత్రి మహిళలను కించపరుస్తున్నారు
- బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి

ఘట్‌కేసర్: తెలంగాణలో మహిళలకు రక్షణ లేదని, బీఆర్ఎస్ నేతలు మహిళలను కించపరుస్తున్నారని, లైంగికంగా వేధిస్తున్నారని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఇందుకోసమేనా అని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్ ఎంపీటీసీ కొమ్మిడి శోభారాణిదామోధర్‌రెడ్డిపై దాడిని ఖండిస్తూ చౌదరిగూడ రాయల్ కుటీర్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమావేశంలో అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాడి చేసి సంస్కారహీనంగా వ్యవహరించారని, ధాన్యం సమస్య తెలంగాణలోని రైతులందరిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీటీసీపై దాడి అంశాన్ని వదిలేది లేదని, చట్టపరంగా ఎదుర్కొంటామన్నారు. మహిళా ఎంపీటీసీ దాడిని మహిళా కమిషన్ ఎందుకు సుమోటోగా తీసుకోలేదని, అది కవిత కమిషన్‌గా మారిందని ఎద్దేవా చేశారు. మహిళలను కించపరిచిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి, సైదులురెడ్డి క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. ఎవరినీ వదిలేది లేదన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని కోరితే తప్పా?

ధాన్యం కొనుగోలు చేయకుండా, గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా దశాబ్ది ఉత్సవాల్లో హీరో, హీరోయిన్లతో డాన్స్ చేయించాలని, రైతు వేదికలను లైట్లతో అలంకరించాలని మంత్రి అనడం సిగ్గుచేటని ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, అంకుషాపూర్ ఎంపీటీసీ శోభారాణిదామోదర్‌రెడ్డి అన్నారు. ఒకవైపు కల్లాల్లో ధాన్యం కుప్పలతో రైతులు పడిగాపులు కాస్తుంటే ప్రజల సొమ్ముతో బీఆర్ఎస్ నేతలు సంబురాలు చేసుకుంటున్నారన్నారు.

కలెక్టరేట్.. టీఆర్ఎస్ భవనమా..?

అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా స్థానిక మంత్రి మహిళా మేయర్లు, ఎంపీపీలతో దాడి చేయించి బయట పడేశారన్నారు. కలెక్టర్ కార్యాలయం మంత్రి సొంత నిధులతో నిర్మించారా, కలెక్టర్ సాక్షిగా దాడి జరుగుతుంటే కలెక్టర్ ఎందుకు స్పందించలేదని, అదేమైనా టీఆర్ఎస్ భవనమా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బండి సంజయ్ ఆధ్వర్యంలో బీజేపీ జెండా ఎగిరేది ఖాయమన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి నిర్మలరెడ్డి, శ్రీసుధ, రాణిసుధాకర్, మహిపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, పలు జిల్లాల మహిళా మోర్చా నేతలు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను నిత్యం స్మరించుకోవాలి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న సుధాకర్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: భారత రాజ్యాంగంపై ప్రమాణ స్వీకారం చేసి రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ సీనియర్ నేత వీరేశ్, అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏదులాబాద్, ఘట్‌కేసర్ ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహం పూలమాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుడు అంబేడ్కర్‌ను నిత్యం స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మేకల దాసు, నర్సింగ్‌రావు, బాలయ్య, శ్రీనివాస్, ఆనంద్, సంజీవ, స్వామి, మహేశ్, మల్లేశ్, అంజయ్య, గణేశ్ పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయాలి



దొంగల మైసమ్మ వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

శామీర్‌పేట్: దాడికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మేడ్చల్ కలెక్టరేట్‌లో శనివారం బీజేపీ నాయకులపై దాడికి నిరసనగా బీజేపీ నాయకులు ఆదివారం దొంగల మైసమ్మ వద్ద కరీంనగర్-హైదరాబాద్ రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని ప్రస్తావించిన వారిపై దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. పార్టీ ప్రతినిధులు శోభ, ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందజేస్తున్న ప్రభుత్వం



దమ్మాయిగూడ పద్మశాలి కాలనీలో పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: ఇంటింటికీ నల్లా ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చిందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శనివారం రాత్రి దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధి 12వ వార్డులోని పద్మశాలినగర్ కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇటు మున్సిపాలిటీల్లో, అటు గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంలో భాగంగా అవసరమైన చోట ఓహెచ్ఆర్ ట్యాంకులను నిర్మించి కొత్తగా నీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికీ నీటిని అందజేస్తోందని అన్నారు. ఇటీవల కాలంలో కొత్తగా ఏర్పాటైన పద్మశాలినగర్ కాలనీలో త్వరితగతిన పైప్‌లైన్ పనులు పూర్తిచేసి ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ స్వామి, కౌన్సిలర్ పాండాల అనురాధయాదగిరిగౌడ్, బీఆర్ఎస్ నేతలు హరిగౌడ్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని దస్పల్లా హోటల్‌లో జరిగిన హైదరాబాద్ రన్నర్స్ వార్షిక అవార్డ్స్ ఫంక్షన్‌లో హైదరాబాద్ డీజీపీ కమాండ్ కంట్రోల్ డయల్ 100 ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్‌రెడ్డి, బెస్ట్ డెబ్యూ అవార్డ్ హాఫ్ మారథాన్ (21కె) కేటగిరీలో ప్రత్యేక అవార్డు పొందారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ను ఉన్నతాధికారులు, తోటి సిబ్బంది అభినందించారు.

ఉన్నత ఆలోచనలతో ముందుకెళ్లాలి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు ఉన్నతమైన ఆలోచనలతో ముందుకు వెళ్లాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ దంపతులు గంగరాజు, విజయకుమారి 22 వివాహ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొని కేక్ కట్ చేసి అందరికీ పంచారు.

రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలి



కీసర: నాగారంలో టైగర్స్ క్లబ్స్ త్వైకాండో అకాడమిలో అకాడమి ఫౌండర్, ఆర్గనైజర్ జి.శివకుమార్ ఆధ్వర్యంలో ఇంటర్ క్లబ్ చాంపియన్‌షిప్‌తో పాటు కలర్ బెల్ట్ ఎగ్జామినేషన్ నిర్వహించారు. 85 మంది క్రీడాకారులు పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించి కలర్ బెల్ట్స్, మెడల్స్ సాధించారు. కార్యక్రమంలో సింగిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవికిరణ్‌రెడ్డి, కోచ్‌లు రాహుల్‌కృష్ణ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. గతనెలలో రాజస్థాన్‌లో జరిగిన నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న క్రీడాకారులకు ట్రాక్‌సూట్స్ స్పాన్సర్ చేశారు. ప్రతి ఒక్కరూ క్రీడాల్లో పాల్గొని మన ఊరికి మన రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

ఎన్టీఆర్‌కు నివాళి

మేడ్చల్: మహానటుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం దివంగత నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకలను మేడ్చల్‌లో ఆయన అభిమానులు, బీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. మార్కెట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి ఆయన తెలుగు జాతికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్ రాజు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న వివిధ రాజకీయ పార్టీల నేతలు

అందరికీ అందుబాటులోకి మెరుగైన వైద్యం



అన్నోజిగూడలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చైర్మన్ కొండల్‌రెడ్డి



కొర్రెముల్ సుప్రభాత్ టౌన్‌షిప్‌లో..

పోచారం: మెరుగైన ఆధునిక వైద్యం అందరికీ అందుబాటులోకి రావాలని చైర్మన్ కొండల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అన్నోజిగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నీలిమ హాస్పిటల్స్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు రాయితీలతో కూడిన వైద్య సేవలు అందించేందుకు నీలిమ హాస్పిటల్స్ యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయం అన్నారు. అనంతరం 50 శాతం వైద్య సేవల రాయితీ కార్డులను వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి హాస్పిటల్ ఎండీ డా.పల్లా అపురూప్‌రెడ్డి అందజేశారు. వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషయన్లతో పాటు పీడియాట్రిక్స్, పల్మనాలజీ, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ వైద్య నిపుణులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ఘట్‌కేసర్: కొర్రెముల్ సుప్రభాత్ టౌన్‌షిప్‌లో ఆ కాలనీ సంక్షేమ సంఘం, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మేడిపల్లి కాకతీయ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. ఉదరకోశ వైద్య నిపుణులు రోహిత్‌రెడ్డి, ఎముకల వైద్యనిపుణులు సంపత్‌రెడ్డి రోగులను పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజయ్య, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేణుమాధవ్, మేడిపల్లి కాకతీయ ఆస్పత్రి వైద్యబృందం, కాలనీ వాసులు పాల్గొన్నారు.



నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో..

నాగారం మున్సిపాలిటీ పరిధిలో..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో ఆదివారం యోధ డయాగ్నోసిస్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. 8వ వార్డులోని వివిధ కాలనీలకు చెందిన ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కౌకుట్ల మమతకృష్ణారెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.